# కేన్స్ టెక్నాలజీ ఆగయా

- కొత్తగా 2వేలకుపైగా రానున్న ఉద్యోగాలు
- రాష్ట్రంలో సెమీకండక్టర్ల తయారీకి మరింత ఉత్సాహం

## కొంగరకలాన్‌లో ప్లాంట్ కోసం భూమిపూజ

### రూ.3,000 కోట్ల పెట్టుబడులు పెడుతున్న సంస్థ

*నిన్న ఫాక్స్‌కాన్.. నేడు కేన్స్ టెక్నాలజీ.. రేపు...*

*తెలంగాణకు దేశ, విదేశీ ఎలక్ట్రానిక్స్ రంగ సంస్థలు క్యూ కడుతున్నాయి.*

*రూ.3వేల కోట్ల పెట్టుబడితో కొంగరకలాన్‌లో తెస్తున్న కేన్స్ సెమీకండక్టర్ ప్లాంట్‌కు భూమిపూజ జరిగింది. దీంతో 2వేల మందికి ఉద్యోగావకాశాలు రానున్నాయి.*



కేన్స్ టెక్నాలజీ సెమీకండక్టర్ ప్లాంట్‌కు భూమిపూజ చేస్తున్న సంస్థ చైర్‌పర్సన్ సవితా రమేశ్, టీఎస్ఐఐసీ ఎండీ వెంకట నర్సింహారెడ్డి, రాచకొండ సీపీ దేవేంద్ర చౌహాన్, సంస్థ ఎండీ రమేశ్ కన్నన్, రాష్ట్ర ప్రభుత్వ ఇండస్ట్రీ, కామర్స్ ప్రత్యేక కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు

ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 24: తెలంగాణలో మరో భారీ పరిశ్రమ కొలువుదీరబోతున్నది. రాష్ట్రంలో ఓఎస్ఏటీ, కాంపౌండ్ సెమీ కండక్టర్ ఉత్పాదక కేంద్రాన్ని కేన్స్ టెక్నాలజీ తీసుకువస్తున్నది. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని కొంగరకలాన్ గ్రామంలో ఈ ప్లాంట్ కోసం మంగళవారం భూమిపూజ జరిగింది. ఇప్పటికే ఇక్కడ గ్లోబల్ ఎలక్ట్రానిక్స్ దిగ్గజం ఫాక్స్‌కాన్ ప్లాంట్‌ను తెస్తుండగా, ఆ పక్కనే ఇప్పుడు కేన్స్ సెమీకండక్టర్ తయారీ కేంద్రం రానున్నది. కాగా, పరిశ్రమలకు తెలంగాణ స్వర్గధామంగా మారిందని, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి పారిశ్రామికవేత్తలు పెద్ద ఎత్తున ముందుకొస్తున్నారని టీఎస్ఐఐసీ మేనేజింగ్ డైరెక్టర్ వెంకట నర్సింహారెడ్డి ఈ సందర్భంగా అన్నారు. రాచకొండ సీపీ దేవేంద్ర చౌహాన్‌తో కలిసి ఆయన భూమిపూజ చేశారు. కార్యక్రమంలో పలువురు సంస్థ ప్రతినిధులు కూడా పాల్గొన్నారు. రూ.3,000 కోట్ల పెట్టుబడితో ఈ ప్లాంట్‌ను కేన్స్ టెక్నాలజీ తెస్తుండగా, దీంతో కొత్తగా 2,000 మందికిపైగా ఉద్యోగావకాశాలు రానున్నాయి. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కే తారక రామారావుతో కేన్స్ టెక్నాలజీ చైర్‌పర్సన్ సవితా రమేశ్, ఎండీ రమేశ్ కన్నన్ సమావేశం నేపథ్యంలోనే ఈ ప్లాంట్ రాష్ట్రానికి వచ్చిన విషయం తెలిసిందే.

**మౌలిక వసతులన్నీ..**

తెలంగాణలో పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన అన్నిరకాల సదుపాయాలను రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్నదని, దీంతో పెట్టుబడిదారులు భారీగా ముందుకొస్తున్నారని నర్సింహారెడ్డి తెలిపారు. ఇప్పటికే రాష్ట్రంలో అనేక ఐటీ, ఎలక్ట్రానిక్ దిగ్గజ కంపెనీలు ఏర్పాటయ్యాయని గుర్తుచేశారు. ఈ క్రమంలో కేన్స్ టెక్నాలజీ కూడా రావడం సంతోషకరమన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు ముందుకొచ్చే కంపెనీలకు భూములు, విద్యుత్తు, రోడ్లు, నీరు ఇలా అనేక రకాల మౌలిక సదుపాయాలను టీఎస్ఐఐసీ ద్వారా వెంటనే కల్పిస్తున్నట్టు చెప్పారు. టీఎస్ఐపాస్ ద్వారా ఇతరత్రా అనుమతులూ తక్షణమే ఇస్తున్నామని వివరించారు. ఆయన అన్నారు.

**చకచకా ఫాక్స్‌కాన్ పనులు**

మరోవైపు కొంగరకలాన్ వద్ద ఫాక్స్‌కాన్ సంస్థ ఏర్పాటుచేస్తున్న ప్లాంట్ పనులు చకచకా సాగుతున్నాయి. ఈ ఉత్పాదక కేంద్రం ప్రారంభమైతే ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. కాగా, గడిచిన దాదాపు పదేండ్లలో రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన మౌలిక వసతుల ద్వారా అనేక జిల్లాల్లో పెట్టుబడులకు పారిశ్రామికవేత్తలు ముందుకొచ్చారని టీఎస్ఐఐసీ ఎండీ వెంకట నర్సింహారెడ్డి వెల్లడించారు. దీంతో తెలంగాణలో పారిశ్రామిక ప్రగతి చకచక ముందుకు సాగుతున్నదన్నారు. ప్రభుత్వానికి సంపద పెరుగడంతోపాటు లక్షలాది మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కూడా లభిస్తున్నాయన్నారు. ఈ క్రమంలోనే కేన్స్ సెమికండక్టర్ ప్లాంట్‌తోనూ 2వేల మందికి ఉద్యోగావకాశాలు రాబోతున్నాయని తెలిపారు.

**శాంతిభద్రతలకు ఢోకాలేదు**

శాంతిభద్రతల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని, ఈ విషయంలో ఇతర రాష్ట్రాల కంటే తెలంగాణ ఎంతో మెరుగ్గా ఉందని రాచకొండ సీపీ దేవేంద్ర చౌహాన్ అన్నారు. రాష్ట్రంలోకి పెట్టుబడులు పెద్ద ఎత్తున రావడానికి ఇది కూడా ఓ కారణమేనని పేర్కొన్నారు. కాగా, ఆదిబట్ల సమీపంలో టీసీఎస్‌ను ఏర్పాటు చేయటం వల్ల ఆ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందిందని, అక్కడ ప్రభుత్వం ప్రత్యేకంగా ఓ పోలీసుస్టేషన్‌ను సైతం ఏర్పాటు చేసిందని ఈ సందర్భంగా చౌహాన్ గుర్తుచేశారు. పరిశ్రమలు ఏర్పాటైతే నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు పెరుగడంతోపాటు స్థానికంగా భూముల ధరలూ పెరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ఇండస్ట్రీ, వాణిజ్య ప్రత్యేక కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి, ఎలక్ట్రానిక్ సెమీకండక్టర్స్ డైరెక్టర్ చిత్ర హరిహరణ్, సంస్థ ఎండీ రమేశ్ కన్నన్ తదితరులు పాల్గొన్నారు.

*ఈ ప్లాంట్‌లో తయారయ్యే సెమీకండక్టర్స్‌ను దేశ, విదేశీ మార్కెట్లలోకి తీసుకెళ్తాం. తైవాన్, జపాన్ తదితర దేశాలకు ఎగుమతి అవుతాయి. రకరకాల ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల కోసం మదర్ బోర్డులనూ తయారు చేస్తాం. భవిష్యత్తులో కొంగరకలాన్ పేరు.. ఎలక్ట్రానిక్స్ హబ్‌గా మార్మోగుతుంది. టెక్నాలజీ ఎంతో అభివృద్ధి చెందిన తైవాన్, జపాన్ వంటి దేశాల సరసన భారత్ నిలువడానికి కొంగరకలాన్ తరహా ఇండస్ట్రియల్ పార్కులు అవసరం.*

*-సవితా రమేశ్, కేన్స్ టెక్నాలజీ చైర్‌పర్సన్*

### కంపెనీ ఉత్పత్తి చేస్తున్న పరికరాలు..

| | |
|---|---|
| **మెడికల్:** | స్మార్ట్ గ్లూకోమీటర్, వ్యాప్‌కేర్, కంట్రోలర్ |
| **రైల్వేస్:** | ఆడియో ఫ్రీక్వెన్సీ ట్రాక్ సర్క్యూట్, ఈటీసీఎస్-ఆన్ బోర్డ్ క్యూబికల్ |
| **ఐవోటీ/ఐటీ:** | బార్ కోడ్ స్కానర్, పీఎల్‌సీ గేట్‌వే, ఆర్ఎఫ్ఐడీ గేట్‌వే, గేట్‌వే అసెట్ కండిషన్ మానిటరింగ్, ఇండస్ట్రియల్ ట్యాబ్లెట్, హెచ్ఎంఐ, ఆర్‌టీడీ టెంపరేచర్ |
| **ఇండస్ట్రియల్:** | ఇంజిన్ కంట్రోల్, స్ట్రీట్ లైట్ కంట్రోలర్, యాక్సలేరోమీటర్, ఇండస్ట్రియల్ యూపీఎస్, |
| **ఏరోస్పేస్ డిఫెన్స్:** | ఎలక్ట్రానిక్ సేఫ్ అండ్ ఫైర్ పరికరం, ఏటీఈ అండ్ ఎల్ఆర్‌యూ అసెంబ్లింగ్, హ్యాండ్ హెల్డ్ సోనార్ |
| **ప్రారంభం:** | 1988 |
| **ప్రధాన కేంద్రం:** | మైసూరు |
| **కీలక వ్యక్తులు:** | సవితా రమేశ్ (చైర్‌పర్సన్), రమేశ్ కన్నన్(ఎండీ) రాజేశ్ శర్మ (సీఈవో) |
| **ఉద్యోగులు:** | 1,500 |
| **ఆదాయం:** | రూ.676 కోట్లు (2022-23లో) |



### స్కైరూట్ 'విక్రమ్-1' రాకెట్!

రాష్ట్రానికి చెందిన రాకెట్ల తయారీ స్టార్టప్ స్కైరూట్..విక్రమ్-1 రాకెట్‌ను ప్రదర్శించింది. వచ్చే ఏడాది తొలి నాళ్లలో అంతరిక్షంలోకి ప్రవేశపెట్టనున్న ఈ రాకెట్‌ను హైదరాబాద్‌లోని జీఎమ్మార్ ఏరోస్పేస్ అండ్ ఇండస్ట్రియల్ పార్క్‌లో కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి జితేంద్ర సింగ్ ప్రారంభించారు. 60 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ రాకెట్ డెవలప్‌మెంట్ కేంద్రం దేశంలో అతిపెద్దది కావడం విశేషం. తక్కువ భూమి కక్ష్యలో తిరిగి 300 కిలోల బరువు కలిగిన ఈ రాకెట్ కంపెనీ నుంచి వస్తున్న రెండోది కావడం విశేషం. గతేడాది నవంబర్ 18న విక్రమ్-ఎస్‌ను అంతరిక్షంలోకి ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే.

# అదానీ టోటల్ షేరు 85% పతనం



### హిండెన్‌బర్గ్ లక్ష్యానికి తగ్గిన ధర

ముంబై, అక్టోబర్ 24: కృత్రిమంగా ప్రమోటర్లు పెంచిన కారణంగా అదానీ గ్రూప్ షేర్లు అధిక విలువలకు ట్రేడవుతున్నాయని, అవి 85 శాతం పతనమవుతాయంటూ యూఎస్ హెడ్జ్ ఫండ్ హిండెన్‌బర్గ్ ఈ ఏడాది జనవరిలో పేర్కొన్న మేరకు తాజాగా అదానీ టోటల్ గ్యాస్ షేరు అదే విలువకు పడిపోయింది. అదానీ గ్రూప్ పలు షెల్ కంపెనీలకు నిధుల్ని మళ్లించి, షేర్లను ఇష్టానుసారం పెంచివేసిందని, పలు కార్పొరేట్ మోసాలకు పాల్పడిదంటూ జనవరి 24న హిండెన్‌బర్గ్ ఒక రిపోర్ట్‌ను విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఈ నివేదిక వెలువడినంతనే అదానీ గ్రూప్ మార్కెట్ విలువ రూ. 10 లక్షల కోట్లకుపైగా కరిగిపోయిన విషయం విదితమే. అటుతర్వాత మరో యూఎస్ ఫండ్ జీక్యూజీ పార్ట్‌నర్స్ పెట్టుబడులతో కొంతమేరకు అదానీ గ్రూప్ షేర్లు కోలుకున్నా, ఇటీవల తిరిగి తగ్గుముఖం పడుతున్నాయి. అందులో సిటీ-గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ అయిన అదానీ టోటల్ షేరు బీఎస్ఈలో సోమవారం నాటి రూ. 575కు తగ్గింది. జనవరి 24న ఈ షేరు ధర రూ.3,892. దీంతో పోలిస్తే కేవలం తొమ్మిది నెలల్లో అదానీ టోటల్ ధర 85 శాతం పతనమయ్యింది. అదానీ గ్రూప్‌నకు చెందిన 10 షేర్లు ప్రస్తుతం మార్కెట్లో ట్రేడవుతున్నాయి. అవి..అదానీ ఎంటర్‌ప్రైజెస్, అదానీ ట్రాన్స్‌మిషన్, అదానీ గ్రీన్ ఎనర్జీ, అదానీ టోటల్ గ్యాస్, అదానీ విల్మార్, అదానీ పోర్ట్స్ అండ్ సెజ్, అదానీ పవర్, ఏసీసీ, అంబుజా సిమెంట్స్, ఎన్డీటీవీలు. వీటిలో ఎన్డీటీవీని అదానీ గ్రూప్ ఇటీవల కొనుగోలు చేసింది. మిగిలిన తొమ్మిది గ్రూప్ కంపెనీల్లో అదానీ పోర్ట్స్ మినహా మిగిలిన షేర్లన్నీ జనవరి 24 ధరలతో పోలిస్తే ప్రస్తుతం 20 నుంచి 70 శాతం నష్టాలతో ట్రేడవుతున్నాయి.

**హిండెన్‌బర్గ్ ఏమన్నదంటే..**

కార్పొరేట్ అవకతవకల్ని పరిశీలించకపోయినా, అదానీ గ్రూప్ కంపెనీల ఆర్థిక పనితీరును ప్రకారం ఆయా షేరు ధరలు చాలా అధికమని ఇట్టే తెలిసిపోతుందని హిండెన్‌బర్గ్ రిపోర్ట్‌లో వ్యాఖ్యానించింది. మౌలిక రంగ కంపెనీల వృద్ధి తీరు నిద్రాణంగా ఉంటుందని, లాభాల్లో వృద్ధి అంతంతమాత్రమేనని, అందుచేత అవి తక్కువ పీఈ (ప్రైస్ టు ఎర్నింగ్స్) రేషియోతో ట్రేడవుతాయని వివరించింది. అయినప్పటికీ, అదానీ లిస్టెడ్ కంపెనీల స్టాక్ విలువలు అధిక వృద్ధిని సాధించే టెక్నాలజీ కంపెనీలతో పోటీపడుతున్నాయని, సంవత్సరాల తరబడి కృత్రిమంగా షేర్ల ధరల్ని పెంచడం ఇందుకు కారణమని ఆరోపించింది.

# చిన్న మదుపరులకు అవకాశం

### ఆర్బీఐ పోర్టల్ ద్వారా ఫ్లోటింగ్ రేట్ సేవింగ్స్ బాండ్లలో పెట్టుబడి

న్యూఢిల్లీ, అక్టోబర్ 24: చిన్న మదుపరులకు తాజాగా రిజర్వ్‌బ్యాంక్ తన పోర్టల్ ద్వారా మరో మదుపు సాధనంలో పెట్టుబడికి అనుమతి ఇచ్చింది. ఫ్లోటింగ్ రేట్ సేవింగ్స్ బాండ్లను (ఎఫ్ఆర్ఎస్‌బీలు) తమ రిటైల్ డైరెక్ట్ పోర్టల్ ద్వారా కొనుగోలు చేయవచ్చని ఆర్బీఐ ఒక ప్రకటనలో తెలిపింది. ఇప్పటివరకూ రిటైల్ డైరెక్ట్ పోర్టల్ ద్వారా సావరిన్ గోల్డ్ బాండ్లు, కేంద్ర ప్రభుత్వ సెక్యూరిటీలు, ట్రెజరీ బిల్స్, రాష్ట్ర ప్రభుత్వ సెక్యూరిటీలను మాత్రమే రిటైల్ ఇన్వెస్టర్లు పెట్టుబడి చేసే వీలు ఉంది. ఇక నుంచి ఎఫ్ఆర్ఎస్‌బీ, 2020ల్లో (ట్యాక్సబుల్) రూ.20,000 వరకూ పోర్టల్ ద్వారా మదుపు చేయవచ్చు.

**ఎన్ఎస్‌సీ కంటే వడ్డీ అధికం**

ఎఫ్ఆర్ఎస్‌బీలు కేంద్ర ప్రభుత్వం జారీ చేసే నాన్-ట్రేడబుల్ బాండ్లు. ఈ బాండ్ల కాలపరిమితి ఏడేండ్లు. పోస్టాఫీసుల్లో జారీ అయ్యే నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ (ఎన్ఎస్‌సీ) వడ్డీ రేటు కంటే ఎఫ్ఆర్ఎస్‌బీలపై 0.35 శాతం అదనంగా వడ్డీ లభిస్తుంది. ప్రస్తుతం ఎన్ఎస్‌సీపై వడ్డీ రేటు 8.05 శాతం. ఆర్బీఐ సేవింగ్స్ బాండ్లపై వడ్డీని ప్రతీ ఏడాది రెండు దఫాలుగా (జనవరి 1, జూలై 1) చెల్లిస్తారు. ఇవి నాన్-ట్రేడబుల్ బాండ్లు అయినందున వీటి నుంచి మధ్యలో వైదొలిగే అవకాశం లేదు. జారీ చేసిన తేదీ నుంచి ఏడేండ్లు పూర్తయిన తర్వాత బాండ్లలో పెట్టుబడి మొత్తాన్ని చెల్లిస్తారు.

## కోక-కోలా రెండంకెల వృద్ధి

న్యూఢిల్లీ, అక్టోబర్ 24: శీతల పానియాల తయారీ సంస్థ కోక-కోలా..భారత్‌లో అత్యధిక వృద్ధిని నమోదు చేసుకుంటున్నది. సెప్టెంబర్ త్రైమాసికంలో విలువపరంగా చూస్తే రెండంకెల వృద్ధిని నమోదు చేసుకున్నట్టు కంపెనీ చైర్మన్, సీఈవో జేమ్స్ క్విన్సీ తెలిపారు. ఆసియా పసిఫిక్‌తో పాటు వర్ధమాన మార్కెట్ల వృద్ధి కంటే భారత్‌లో అత్యధికంగా ఉంటున్నదని, జూన్ త్రైమాసికం కంటే ఆ తర్వాతి త్రైమాసికంలో రెండంకెల వృద్ధిని సాధించిందని ఆయన చెప్పారు.

# టాప్‌గేర్‌లో లగ్జరీ కార్లు

*బెంజ్, ఆడీ, బీఎండబ్ల్యూ, జేఎల్ఆర్‌కు డిమాండ్*



న్యూఢిల్లీ, అక్టోబర్ 24: దేశవ్యాప్తంగా లగ్జరీ కార్లు టాప్‌గేర్‌లో దూసుకుపోతున్నాయి. ఏడాదికి ఏడాదికి అమ్మకాలు అంతకంతకు పెరుగుతున్నాయి. కస్టమర్లు విలాసవంతమైన, అత్యధిక ఫీచర్స్ ఉన్న కార్లను కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతుండటంతో ప్రతియేటా రెండంకెల వృద్ధిని నమోదు చేసుకుంటున్నాయి. దేశ ఆర్థిక వ్యవస్థ అంతంత మాత్రంగానే ఉన్నప్పటికీ లగ్జరీ కార్ల విక్రయాలు మాత్రం ఏటేటా పెరుగుతున్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబర్ చివరినాటికి 33 వేల యూనిట్లు అమ్ముడయ్యాయి. 2022లో అమ్ముడైన 36 వేల స్థాయికి ఇంచుమించుకు చేరుకున్నాయి. ప్రస్తుత పండుగ సీజన్ కూడా జతవనుండటంతో ఈ ఏడాది 43 వేల నుంచి 45 వేల యూనిట్లకు చేరుకోనున్నాయని మార్కెట్ వర్గాలు అంచనావేస్తున్నాయి. ప్రధానంగా మెర్సిడెజ్ బెంజ్, ఆడీ, బీఎండబ్ల్యూ, జేఎల్ఆర్, వోల్వోలు లగ్జరీ కార్ల విక్రయ మార్కెట్లో ఉన్నాయి. 2018లో భారత్‌లో 41 వేలుగా ఉన్న లగ్జరీ కార్ల మార్కెట్ కరోనా దెబ్బకు కుదేలైంది. 2020 నాటికి ఇది 18 వేల నుంచి 19 వేలకు పడిపోయింది. ఆ తర్వాతి ఏడాది కూడా అంతంత మాత్రంగానే ఉండటం, 2022లో మాత్రం తిరిగి కోలుకున్నది. గడిచిన సంవత్సరంలో 36 వేల యూనిట్లు అమ్ముడయ్యాయి.

**ద్రవ్యోల్బణం-వడ్డీరేట్ల సవాళ్లు**

ద్రవ్యోల్బణం రికార్డు స్థాయిలో పెరుగుతుండటం, అధిక వడ్డీరేట్లు దేశీయ ఆటోమొబైల్ ఇండస్ట్రీపై ప్రతికూల ప్రభావం చూపుతున్నది. అధిక ద్రవ్యోల్బణం కారణంగా వడ్డీ రేట్లు మరింత పెరుగుతాయన్న అంచనా కొనుగోళుదారుల్లో నెలకొన్నది. దీంతో కార్లను కొనుగోలు ప్రక్రియను వాయిదావేస్తున్నట్టు ఆటోమొబైల్ ఇండస్ట్రీ వర్గాలు వెల్లడించాయి. బుకింగ్ చేసుకున్న కారుకు కనీసంగా మూడు నుంచి ఆరు నెలల సమయం పడుతుండటం కూడా ఇందుకు కారణం.

**మెర్సిడెజ్ బెంజ్..**

జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల తయారీ సంస్థ మెర్సిడెజ్ బెంజ్ జనవరి నుంచి సెప్టెంబర్ నాటికి తొమ్మిది నెలల్లోనే 12,768 యూనిట్లను విక్రయించింది. క్రితం ఏడాది అమ్ముడైన దాంతో పోలిస్తే 11 శాతం అధికమని పేర్కొంది. రికార్డు రెండంకెల వృద్ధిని నమోదు చేసుకోవడం కూడా ఇదే తొలిసారి.

**బీఎండబ్ల్యూ..**

మరో లగ్జరీ కార్ల సంస్థ బీఎండబ్ల్యూ 9,580 యూనిట్ల వాహనాలను విక్రయించింది. బీఎండబ్ల్యూ, మినీ బ్రాండ్‌లతో పలు మాడళ్లను దేశీయంగా విక్రయిస్తున్నది.

**ఆడీ..**


గత తొమ్మిది నెలల్లో 5,530 యూనిట్లను విక్రయించింది ఆడీ. 2022 ఏడాది ఇదే సమయంలో అమ్ముడైన 1,343 యూనిట్లతో పోలిస్తే 88 శాతం అధికం.

**వోల్వో కార్ ఇండియా..**

స్వీడన్‌కు చెందిన కార్ల సంస్థ వోల్వో ఇండియా కూడా అమ్మకాల్లో 40 శాతం వృద్ధిని కనబరిచింది. జనవరి-సెప్టెంబర్ మధ్యకాలంలో సంస్థ 1,751 యూనిట్ల వాహనాలను విక్రయించింది.

**జేఎల్ఆర్ ఇండియా..**

జేఎల్ఆర్ ఇండియా రికార్డు స్థాయి పనితీరు కనబరిచింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో అమ్మకాలు 105 శాతం ఎగబాకి 2,356 యూనిట్లకు చేరుకున్నాయి. గతేడాది ఇది 1,308గా ఉన్నది.




# కుప్పకూలాయి..

## మిడిల్ ఈస్ట్ దెబ్బకు స్టాక్ మార్కెట్లు విలవిల

### ఆవిరైన రూ.8 లక్షల కోట్ల మదుపరుల సంపద

### టెలికం, రియల్టీ, చమురు రంగాల షేర్లు కుదేలు




ముంబై, అక్టోబర్ 24: వరుస నష్టాల్లో కదలాడుతున్న దేశీయ స్టాక్ మార్కెట్లు.. భారీ నష్టాలను మూటగట్టుకున్నాయి. సోమవారం బాంబే స్టాక్ ఎక్స్చేంజ్ ప్రధాన సూచీ సెన్సెక్స్ 825.74 పాయింట్లు లేదా 1.26 శాతం పతనమై 65 వేల మార్కుకు దిగువన 64,571.88 వద్ద ముగిసింది. ఒకానొక దశలో 894.94 పాయింట్లు పడిపోయింది. నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ సూచీ నిఫ్టీ సైతం 260.90 పాయింట్లు లేదా 1.34 శాతం క్షీణించి 19,281.75 వద్ద నిలిచింది. దీంతో నాల్గోరోజూ సూచీలు కోలుకోనట్టైంది. మరోవైపు ఈ ఒక్కరోజే మదుపరుల సంపద లక్షల కోట్ల రూపాయల్లో ఆవిరైపోయింది.

**దేశీయ మార్కెట్‌లో నష్టాలకు కారణాలు**

- ఇజ్రాయెల్-హమాస్ మధ్య యుద్ధం
- మళ్లీ విజృంభిస్తున్న క్రూడ్ ధరలు
- లాభాల స్వీకరణ దిశగా మదుపరులు
- అమ్మకాల ఒత్తిడిలో కీలక రంగాలు
- అంతర్జాతీయ స్టాక్ మార్కెట్ల పతనం
- ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్ల పెంపు అంచనాలు

**ఆరంభం బాగానే ఉన్నా..**

ఉదయం ఆరంభంలో మార్కెట్లు లాభాల్లోనే మొదలయ్యాయి. అయితే మిడిల్ ఈస్ట్ ఉద్రిక్తతల భయాలు మదుపరులను చుట్టుముట్టాయి. ఇజ్రాయెల్-హమాస్ మిలిటెంట్ల మధ్య యుద్ధం పెట్టుబడుల ఉపసంహరణకు దారితీసింది. ఇప్పటికే ఉన్న రష్యా-ఉక్రెయిన్ ఆందోళనకర పరిస్థితులకు మిడిల్ ఈస్ట్ టెన్షన్లూ తోడవడంతో మార్కెట్ సెంటిమెంట్ దెబ్బతిన్నదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ క్రమంలోనే సమయం గడుస్తున్నకొద్దీ నష్టాలు పెరుగుతూపోయాయని చెప్తున్నారు. ఇక అంతర్జాతీయ స్టాక్ మార్కెట్ల నష్టాలూ.. భారతీయ ఈక్విటీల క్షీణతకు ఓ కారణమేనని పేర్కొంటున్నారు.

**ముడి చమురు సెగ**

ఇజ్రాయెల్-హమాస్ ఉద్రిక్తతలు.. మిడిల్ ఈస్ట్ వాతావరణాన్ని మరింతగా వేడెక్కిస్తున్నాయి. ఈ క్రమంలోనే ముడి చమురు ధరలూ పైపైకి వెళ్తున్నాయి. బ్యారెల్ క్రూడాయిల్ రేటు మళ్లీ 90 డాలర్లను దాటింది. హమాస్ మిలిటెంట్లే లక్ష్యంగా ఇజ్రాయెల్ దాడులు ఇంకా కొనసాగుతుండటంతో ముడి చమురు ధరలు మరింత పెరిగే వీలుందన్న అంచనాలే వినిపిస్తున్నాయి. ఇదే జరిగితే భారతీయ స్టాక్ మార్కెట్లపై ఒత్తిడి తీవ్రతరం కావడం ఖాయమంటున్నారు.

**మిడ్-స్మాల్‌క్యాప్ షేర్లూ..**

లార్జ్‌క్యాప్ షేర్లే కాదు.. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ షేర్లూ నష్టాలకు లోనయ్యాయి. మదుపరులు లాభాల స్వీకరణకే మొగ్గు చూపుతుండటంతో అన్ని రకాల షేర్లు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. దీంతో బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 2.51 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 4.18 శాతం పడిపోయాయి. రంగాలవారీగా టెలికం అత్యధికంగా 3.82 శాతం, ఇండస్ట్రియల్స్ 3.26 శాతం, యుటిలిటీస్ 3.10 శాతం, కమోడిటీస్ 3.06 శాతం, సర్వీసెస్ 2.99 శాతం, రియల్టీ 2.84 శాతం, పవర్ 2.69 శాతం, కన్స్యూమర్ డిస్క్రీషనరీ 2.25 శాతం, ఐటీ 2.14 శాతం, చమురు గ్యాస్ 1.88 శాతం చొప్పున క్షీణించాయి. జేఎస్‌డబ్ల్యూ స్టీల్, టాటా మోటర్స్, టాటా స్టీల్, టీసీఎస్, ఎన్టీపీసీ, విప్రో, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఎస్బీఐ, ఎల్అండ్‌టీ, అల్ట్రాటెక్, ఇండస్ ఇండ్, కొటక్ బ్యాంక్, పవర్‌గ్రిడ్, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు భారీ నష్టాలను చవిచూశాయి.

## రూ.7.59 లక్షల కోట్లు ఆవిరి

*స్టాక్ మార్కెట్ల భారీ నష్టాలతో మదుపరుల సంపద కూడా పెద్ద ఎత్తునే కరిగిపోయింది. బీఎస్ఈలో నమోదైన కంపెనీల మార్కెట్ విలువ సోమవారం ఒక్కరోజే రూ.7,59,041.63 కోట్లు హరించుకుపోయింది. అంతకుముందు మూడు రోజులూ సంపద తరిగిపోగా.. వరుసగా ఈ నాలుగు రోజుల్లో ఆయా సంస్థల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.12,51,700.73 కోట్లు క్షీణించింది. ఫలితంగా బీఎస్ఈ నమోదిత సంస్థల మార్కెట్ విలువ రూ.3,11,30,724.40 కోట్లకు పరిమితమైంది. గత నాలుగు రోజుల్లో సెన్సెక్స్ 1,925 పాయింట్లు లేదా 2.79 శాతం పతనమైంది. నిఫ్టీ సైతం సుమారు 530 పాయింట్లు కోల్పోయింది.*

**అంతర్జాతీయంగా..**

అంతర్జాతీయంగా ఆసియా మార్కెట్లలో ప్రధాన సూచీలైన దక్షిణ కొరియా, జపాన్, చైనా నష్టపోయాయి. ఐరోపాలోని కీలక సూచీలైన బ్రిటన్, జర్మనీ, ఫ్రాన్స్ కూడా నిరాశపర్చాయి. అమెరికా మార్కెట్లూ నేలచూపుల్నే చూస్తున్నాయి. దీంతో ఈ ప్రభావం భారతీయ స్టాక్ మార్కెట్లపైనా పడుతున్నదని మెజారిటీ మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

## వేదాంత గూటికి అజయ్ గోయెల్

న్యూఢిల్లీ, అక్టోబర్ 24: వెటరన్ ఫైనాన్స్ ప్రొఫెషనల్ అజయ్ గోయెల్ తిరిగి సొంతగూటికి చేరారు. గతంలో వేదాంతను వీడి బైజూస్‌లో చేరిన ఆయన..తిరిగి వేదాంత నూతన చీఫ్ ఫైనాన్షియల్ అధికారిగా నియమితులయ్యారు. ప్రస్తుతం సీఎఫ్‌వోగా విధులు నిర్వహిస్తున్న సోనల్ శ్రీవాత్సవ తన పదవికి రాజీనామా చేయడంతో ఆ స్థానంలో గోయెల్ నియమితులయ్యారు. ఈ నియామకం ఈ నెల 30 నుంచి అమల్లోకి రానున్నట్టు సంస్థ బీఎస్ఈకి సమాచారం అందించింది. వేదాంత పునర్వ్యవస్థీకరణలో భాగంగా సీనియర్ ఉన్నతాధికారులు తిరిగి చేరుతున్నారని కంపెనీ వర్గాలు వెల్లడించాయి. ఈ ఏడాది మొదట్లో వేదాంతను వీడిన ఆయన బైజూస్‌లో చేరారు. అక్టోబర్ 23, 2021 నుంచి ఏప్రిల్ 9, 2023 వరకు వేదాంత యాక్టింగ్ సీఎఫ్‌వోగా పనిచేశారు.




## ఐపీవోకి సెల్లో వరల్డ్

న్యూఢిల్లీ, అక్టోబర్ 24: గృహోపకరణాలు, స్టేషనరీ ఉత్పత్తుల సంస్థ సెల్లో వరల్డ్.. స్టాక్ మార్కెట్లోకి అడుగుపెట్టబోతున్నది. రూ.1,900 కోట్ల నిధుల సేకరణకు సంబంధించి షేరు ధరల శ్రేణిని రూ.617 నుంచి రూ.678 మధ్యలో నిర్ణయించింది. ఈ నెల 30న ప్రారంభంకానున్న వాటాల విక్రయం నవంబర్ 1న ముగియనున్నదని తెలిపింది. యాంకర్ పెట్టుబడిదారుల కోసం ఈ నెల 27న విక్రయించనున్నారు. ఆఫర్ ఫర్ సేల్ రూట్‌లో ప్రమోటర్లు, ఇతర వాటాదారులకు సంబంధించిన షేర్లను అమ్మకానికి పెట్టారు. అలాగే అర్హులైన ఉద్యోగులకు రూ.10 కోట్ల విలువైన షేర్లను రిజర్వు చేశారు కూడా.